నమ్మకాన్ని చాల్చాలి. మనలో మహోద్భూత ప్రజాశక్తి నివురుగప్పిన నిప్పులాగే అణగివుంది. ఈ శక్తి జాగృతమవుతుంది. తప్పదు. అంటాడు సుకాంత. ఇదేవిషయాన్ని చెబుతూ, "జ్వాలా ముఖి" అనే తనగేయంలో—

"ధనిక మానవతా
మదించి నర్తించు! గుర్తించకు
గిరులపై రగిలే పేదల గుండెలు
మీకెదురు తిరిగి ముందుకురికి
వస్తూన్న జనలావాప్రవాహం
నేనూ వస్తున్నాను
నాలో రగిలేగుండం
పగిలేదినం
వస్తున్నది...

---

స్కెచ్

# ఎప్పుడూ యింతే!

విశ్వమిత్ర

బైట ప్రపంచలో దీర్ఘాలు తీస్తూ ఎరికవాడు చదివే స్తోత్ర పఠనానికి ఒళ్ళుమండి గోవిందరావు కోపంతో బైటికొచ్చాడు. అసలే కోపంతో వచ్చిన గోవిందరావుకి, గదిలోవున్న ఓ కుర్చీని కోతి ఒకటి దర్జాగా అలంకరించివుండటం చూసే టప్పటికి నిప్పుని తొక్కినట్లైంది. తనకోసం వచ్చే ఎంతెంత పెద్దమనుషులైనా కుర్చీల్లో కూర్చున్నవాళ్లు, తనని చూడగానే అమాంతం లేచి, రెండుచేతుల్తోనూ హృదయపూర్వకంగా నమస్కారంచేస్తారే, అటువంటిది, అటువంటి కుర్చీలో కూర్చున్న ఓ కోతి, అతి సామాన్యమైన ఒక వానరము తననిచూసి లేచి నమస్కారము పెట్టకపోగా, కనీసం లేచి నిగిపోనన్నా దిగిపోక, పళ్లు ఇకిలిస్తుందా? ఎంతో క్లోజ్ ఫ్రండైనా అలా పళ్ళికిలించడే- అలాటిది ఓ బొమ్మరి కోతి తనని అంత హీనంగా, లెక్కచెయ్యకుండా తన స్వంత ఇంటిలో, తన స్వంత కుర్చీలో కూర్చుని తనని అంత అవమానపరిస్తే, చూస్తూ వూరుకోవ టమేనా తను చెయ్యగలిగిన పని!

"వెంకయ్యా!" వెంటనే పిలిచాడు గోవింద రావు తన స్వంత నౌకర్ని.

మూడోకేకకి వెంకయ్య ఇంట్లోలేడని అధికార పూర్వకంగా తెలిసింది.

కోతి నవ్వకపోయినా, గోవిందరావుకి నవ్వి నట్టే అనిపించింది.

వెంకయ్య ఇంట్లోలేడని చెప్పటానికి వొచ్చిన భార్య, గోవిందరావు కంగారు చూసి,

"ఏమిటండీ! ఆ కంగారూ?" అంది నెమ్మదిగా.

"వీడు... ఈ కోతిమనిషి..." గోవిందరావు పూర్తిగా చెప్పబోయే లోపటికే, గోవిందరావు భార్య ఇంట్లోకి వెళ్ళింది.

గోవిందరావుకి మూడోసారి ఒళ్ళుమండింది. తన సొంత భార్యకూడా తనని-లక్షరూపాయలకి అధికారయిన తనకి...

చేసేది లేక గోవిందరావు కోతిమనిషిని వెళ్ళ గొట్టడానికి, కనీసం బెదిరించడానికి కర్రకోసం, తన గదిలోకి వెళ్ళాడు. గదంతా వెతికాడు... ఊహూం! అదీ దొరకదు...ఎందుకు దొరుకు తుంది? తన సొంత మనుషులే తనని అంత నిర్లక్ష్యంచేసినప్పుడు కొనవది, కర్రకి తను లెక్కేమిటి? చివరికి వెతికి కర్ర తెచ్చాడు గోవింద రావు. కానీ ఈలోగానే గోవిందరావు భార్య ఆ కోతి మనిషికి బిచ్చంవేసి పంపేసింది. గోవింద రావుకి మళ్ళీ వొళ్లుమండింది. కాని వెంటనే తమాయించుకొన్నాడు. గుప్పెడు బియ్యంతో మాట్లాడకుండా పంపించేసిన తన భార్య తెలివికి గోవిందరావు ఒక్కక్షణం సంతోషించాడు. తను మాత్రం ఎప్పుడూ ఇంతే...అనుకుంటూ గోవిందరావు ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళి పన్లో మునిగిపోయాడు-గోవిందరావు ఏవో కాయితాలు చూసుకొంటూండగా, ఎవరో పెద్దమనుషులు గోవిందరావుగారింటికి వచ్చి ఫ్యూన్‌ద్వారా లోపలికి కబురంపారు. గోవిందరావు వాళ్ళ చూసి హడావుడిగా రండి, రండి అంటూ లో

లికి తీసుకెళ్ళాడు. అందర్నీ కూచోబెట్టాడు. కాఫీలు తెప్పించాడు.

అందులో ఒకాయన, ఆయనే ఆవూరి కాలేజీ ప్రెసిడెంట్, మెల్లిగా గోవిందరావు నుద్దేశించి

"ఏమండీ రావుగారూ..."

"రావుగారూ" అని గోవిందరావుని ఇంతవర కెవ్వరూ పిలవలేదు. ఒక్కక్షణం గోవిందరావుకి తననేనా అని అనుమానంవేసి, మళ్ళీ వెంటనే తననే అని మాత్రం తెలుసుకో గలిగాడు.

"...మీరు లక్షాధికారి అయివుండీ కూడా, మా కాలేజీ దాతలపేర్ల లిస్టులో చేరలేదంటే మా కెంతో అవమానకరంగా వుంది..."

గోవిందరావుకి తను లక్షాధికారిననే సంగతి జ్ఞప్తికిరాగానే ఒళ్ళు గగుర్పొడిచింది. పైగా అంతంత పెద్దమనుషులు తన దగ్గిరికి, నిజంగా తన దగ్గిరికి వచ్చి ధర్మం అడుగుతూంటే...

"...కనీసం ఓ ఇరవైవేలైనా వుంటేగానీ మీ పేర హాలు ఏర్పడదు!"

గోవిందరావు కాదనలేకపోయాడు. పెద్ద మనుషులందరూ లేచారు. గోవిందరావులేచాడు. గేటు దాటేదాకా గోవిందరావు వాళ్ళతోనే వున్నాడు.

గోవిందరావు లోపలికి అడుగుపెట్టగానే భార్య ఎదురైంది.

"ఎవళ్ళండీ వాళ్ళు?" అంటూ.

గోవిందరావు గర్వంగా చెప్పాడు,

"కాలేజీ కమిటీ ప్రెసిడెంటూ..."

"ఎందుకొచ్చినట్టూ...?"

"ఎందుకేమిటి కాలేజీకి చందాకి."

"ఎంతా?"

"ఇరవైవేలు!"

ఇరవైవేలనగానే గోవిందరావు భార్య గుండె ఆగినంత పనయింది.

"అదేమిటండీ!" అంది ఆశ్చర్యంగా. గోవింద రావుకీ ఆశ్చర్యపడాలనిపించింది. ఏదోపొరపాటు చేసినట్టు బాధపడ్డాడు గోవిందరావు. 'ఇరవైవేలు' తను తొందరపడ్డాననిపించింది గోవిందరావుకి. తనెప్పుడూ ఇంతే—

ఆరోజల్లా మనసులో బాగుండలేదు గోవింద రావుకి. సాయంత్రం అలా షికారుకైనా పోదామని డ్రైవర్‌ని కేకేశాడు.

"లేడు!"

"ఎందుకుంటాడూ?"

కబురు పంపిన మీదట, ఓ గంటలో వస్తానని మళ్ళీ కబురుపంపాడు. ఎంత సాహసం! గోవింద రావుకి డ్రైవింగ్ రాకా వాడికోసం కబురంపింది. గోవిందరావుకి వొళ్ళు మండింది. వాడు లేకపోతే తనకి జరగదనుకొన్నాడేమో! లేకపోతే ఓ గంట వాయిదా వెయ్యటమేమిటి?

అతి సులువుగా షెడ్‌లోంచి కారుని బైటికి తీశాడు గోవిందరావు.

"ఎక్కడికండీ?" గోవిందరావు భార్య ప్రశ్న. అడిగావూ అనుకొన్నాడు గోవిందరావు.

ఒద్దని మనసులో అనుకొంటూనే "వస్తావా? షికారుకి!" అంటూనే కారు స్టార్ట్ చేశాడు. గోవిందరావుభార్య మూతి ముడుచుకొని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

వూరుదాటిన కారు వేగం హెచ్చింది. ఏమి టేమిటో ఆలోచిస్తూ గోవిందరావు కారు 'డ్రైవ్' చేస్తున్నాడు. ఎదురుగావస్తున్న గాడిద అమాంతం అడ్డంతిరిగింది. పక్కకి తప్పించబోయి "ఠక్"మని చెట్టుకి పెట్టాడు గోవిందరావు. డ్రైవర్‌వుంటే తెలివిగా పక్కకి తప్పించేవాడు. తనెప్పుడూ ఇంతే...

భార్య భుజంతట్టి నిద్రలేపటంతో గోవింద రావుకి ఆకస్మాత్తుగా నిద్రమెలుకువ రావటంచేత వున్నవాడు వున్నట్టు మూర్ఛనుంచి లేచినవాడికి మల్లే విసురుగా పక్కమీంచి లేవబోయేటప్పటికే ఠకీమని కిటికీరెక్క పొడుచుకుంది. కొంచెం మెల్లిగా లేవకూడదూ?...తనెప్పుడూ...

తగిలిన దెబ్బమీద అరచేతిని అణిచిపెట్టి, కలపూర్తిగా మరచిపోని గోవిందరావు "పేపర్ వొచ్చిందా?" అని అడిగాడు.

"క్రీ"సాల్యూషన్ ఎదురుగా పెట్టి గోవింద రావుగారి భార్య,

"చూశారా? నేనుచెప్పినవాటికన్నింటికీ వ్యతి రేకంగా వేశారు. సరిగ్గా నేనుచెప్పినవే వేస్తే..!!"

"నే నెప్పుడూ ఇంతే...!" గోవిందరావు నిస్పృహగా అనేసి మంచంమీద వాలేడు. ★